# ప్రైవేట్‌కు బ్యాటరీ స్టోరేజీ ప్లాంట్

## సొంతంగా ఏర్పాటు చేసేందుకు ముందుకురాని జెన్‌కో

## కేంద్ర సాయంతోపాటు 70 ఎకరాల జెన్‌కో స్థలాన్ని అస్మదీయులకు అప్పగించేందుకు సర్కారు కుట్ర

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో ఏర్పాటు చేయాల్సిన అతిపెద్ద బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్‌పై జెన్‌కో చేతులెత్తేసింది. (బిల్డ్-ఆపరేట్-ఓన్) పద్ధతిలో ఆ ప్లాంట్‌ను సొంతంగా ఏర్పాటు చేయాల్సిన జెన్‌కో పూర్తిగా అస్త్రసన్యాసం చేసింది. ఆ ప్లాంట్‌ను బడాబాబులకు అప్పగించేందుకు టెండర్లను ఆహ్వానించింది. గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ ప్లాంట్ ఏర్పాటుకయ్యే రూ.600 కోట్ల అంచనా వ్యయంలో 40% మొత్తాన్ని (రూ.240 కోట్లు) వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) కింద అందజేస్తుంది. మిగిలిన 60% మొత్తాన్ని (రూ.360 కోట్లు) జెన్‌కో పెట్టుబడిగా పెడితే సరిపోతుంది. అయినప్పటికీ కేంద్ర సాయాన్ని అందిపుచ్చుకోకుండా ఆ ప్లాంట్‌ను ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు జెన్‌కో రంగం సిద్ధం చేసింది. దీంతో కేంద్రం అందించే రూ.240 కోట్లు ప్రైవేట్ వ్యక్తులకు దక్కనున్నాయి.



### విద్యుత్తు జెన్‌కోదే.. అమ్మేదీ జెన్‌కోకే

విచిత్రమేమిటంటే ఈ ప్లాంట్‌లో నిల్వచేసే విద్యుత్తు జెన్‌కోదే. డిమాండ్ లేనప్పుడు జెన్‌కో నుంచి తక్కువ ధరకు విద్యుత్తు కొనుగోలుచేసి ఈ ప్లాంట్‌లోని బ్యాటరీల్లో నిల్వచేస్తారు. డిమాండ్ పెరిగినప్పుడు ఆ విద్యుత్తును మళ్లీ జెన్‌కోకే విక్రయిస్తారు. ఈ ప్లాంట్ జీవిత కాలాన్ని 25 ఏండ్లుగా నిర్ణయించారు. అంటే.. ఈ ప్లాంట్‌ను ఏర్పాటుచేసే ప్రైవేట్ సంస్థ 25 ఏండ్లపాటు జెన్‌కో నుంచి విద్యుత్తు కొనుగోలు చేసి, బ్యాటరీల్లో నిల్వ చేస్తుంది. ఆ విద్యుత్తునే మళ్లీ జెన్‌కోకు విక్రయించి సొమ్ము చేసుకుంటుంది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన జెన్‌కో వార్షిక టర్నోవర్ రూ.15 వేలకోట్ల పైమాటే. అలాంటి సంస్థ బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కేవలం రూ.360 కోట్లు పెట్టుబడిగా పెట్టలేదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై జెన్‌కోతో పాటు ప్రభుత్వం పునరాలోచించాలని విద్యుత్తు రంగ నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

### అస్మదీయుల కోసమేనా?

బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటును ప్రైవేట్ సంస్థకు అప్పగించేందుకు టెండర్లు పిలవడం వెనుక భారీ కుంభకోణం ఉన్నదని, వీజీఎఫ్‌గా సమకూరే రూ.240 కోట్లతోపాటు జెన్‌కోకు చెందిన 70 ఎకరాల స్థలాన్ని అస్మదీయులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వ పెద్దలు కుట్ర చేశారని, అందుకే ఉద్దేశపూర్వకంగా జెన్‌ను తప్పించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. శంకర్‌పల్లిలో గ్యాస్ ఆధారిత విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు కోసం గతంలో స్థల సేకరణ జరిపారు. కానీ, ఆ ప్లాంట్ ఏర్పాటులో ముందడుగు పడలేదు. జెన్‌కో నిర్లక్ష్యం వల్ల ఆ స్థలంలో ఇప్పటికే కొంత భాగం కబ్జాకు గురైంది. మిగిలిన స్థలంలో బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే అదికూడా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుంది. దీన్ని జెన్‌కో ఇంజినీర్లు, ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్‌ను సొంతంగా జెన్‌కో నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఐదింతలైన ఎయిర్‌టెల్ లాభం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశీయ టెలికం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.16,134.6 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,876.4 కోట్ల లాభంతో పోలిస్తే ఐదు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.45, 129.30 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది.

## ఎన్‌ఎండీసీ ఆకర్షణీయం

హైదరాబాద్, ఫిబ్రవరి 6: ఎన్‌ఎండీసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలానికిగాను సంస్థ రూ.1,897 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.1,492.73 కోట్ల లాభంతో పోలిస్తే 29 శాతం ఎగబాకింది. కంపెనీ ఆదాయం 21 శాతం ఎగబాకి రూ.6,942.92 కోట్లకు చేరుకున్నది.



## ఎస్బీఐ లాభం 16,891 కోట్లు

### క్యూ3లో 84 శాతం పెరిగిన ప్రాఫిట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) అదరగొట్టింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.16,891 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.9,164 కోట్ల లాభంతో పోలిస్తే 84 శాతం వృద్ధిని సాధించింది. సమీక్షకాలంలో బ్యాంక్ రూ.1,28,467 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది సమకూరిన రూ.1,18,193 కోట్లతో పోలిస్తే ఇది 8.69 శాతం అధికం. దీంట్లో వడ్డీల రూపంలో రూ.1,17,427 కోట్లు సమకూరినట్లు బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది.

- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.42 శాతం నుంచి 2.07 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ విలువ 0.64 శాతం నుంచి 0.53 శాతానికి దిగొచ్చింది.
- ఎస్బీఐ గ్రూపు కన్సాలిడేటెడ్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 70 శాతం ఎగబాకి రూ.18,853 కోట్లకు చేరుకున్నది. క్రితం ఏడాది ఇది రూ.11,064 కోట్లుగా ఉన్నది. అలాగే ఆదాయం రూ.1,53,072 కోట్ల నుంచి రూ.1,67,854 కోట్లకు ఎగబాకింది.
- బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 4 శాతం అధికమై 41,446 కోట్లుగా నమోదైంది.
- మొండి బకాయిలను పూడ్చుకోవడానికి రూ.911 కోట్ల నిధులను వెచ్చించింది.

## నష్టాల్లో మార్కెట్లు

ముంబై, ఫిబ్రవరి 6: దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలపరంపర కొనసాగుతున్నది. రిజర్వుబ్యాంక్ పరపతి సమీక్షకంటే ముందు మదుపరులు అప్రమత్తతకు మొగ్గుచూపడంతోపాటు ఎఫ్‌ఐఐలు భారీగా నిధులను తరలించుకుపోవడంతో వరుసగా రెండోరోజూ సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 213.12 పాయింట్లు కోల్పోయి 78,058.16 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 92.95 పాయింట్లు కోల్పోయి 23,603.35 వద్ద ముగిసింది. భారతీ ఎయిర్‌టెల్ షేరు 2.47 శాతం పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు టైటాన్, ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, ఐటీసీ, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటర్స్‌లు అత్యధికంగా నష్టపోయాయి.



## అరబిందో లాభంలో క్షీణత

హైదరాబాద్, ఫిబ్రవరి 6: అరబిందో ఫార్మా నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.846 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని మాత్రమే గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.940 కోట్లతో పోలిస్తే 10 శాతం తగ్గినట్లు పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.7,352 కోట్లుగా ఉన్న కంపెనీ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.7,979 కోట్లకు ఎగబాకినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది.

# కొత్త బాస్.. కోతకు సై!





## నేడే ఆర్బీఐ ద్రవ్యసమీక్ష నిర్ణయం

## నూతన గవర్నర్ వడ్డీరేట్లను తగ్గిస్తారన్న అంచనాలు

## రెపో రేటు పావు శాతం దిగివచ్చే అవకాశం

ముంబై, ఫిబ్రవరి 6: ఆర్బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో జరుగుతున్న తొలి ద్రవ్యసమీక్షలో కీలక వడ్డీ రేట్లు తగ్గుతాయనే అంచనాలే ఎక్కువగా వస్తున్నాయి. శుక్రవారం ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఆర్బీఐ ప్రకటించనున్నది. అయితే ఇటీవలి బడ్జెట్ నేపథ్యంలో ఈ ద్రవ్యసమీక్షపై అటు వ్యాపార-పారిశ్రామిక రంగాలు, ఇటు బ్యాంకర్లు-రుణగ్రహీతలు భారీగానే ఆశలు పెట్టుకున్నారు. దీనికి తగ్గట్టుగానే రెపో రేటును పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) కోత పెట్టవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయిప్పుడు. నిజానికి గత ద్రవ్యసమీక్షలో అప్పటి గవర్నర్ శక్తికాంత దాస్.. మున్ముందు పాలసీ రివ్యూల్లో వడ్డీరేట్లు తగ్గవచ్చన్న సంకేతాలనిచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ సమీక్ష మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది.

### ఐదేండ్ల తర్వాత..

గత రెండేండ్లుగా వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే ఆర్బీఐ ద్రవ్యసమీక్షలు ముగుస్తున్నాయి. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా రెపో రేటును 6.50 శాతానికి పెంచారు. అప్పట్నుంచి ఇది అక్కడే ఉంటున్నది. ఇక రెపో రేటును ఆఖరిసారిగా తగ్గించింది 2020 మే నెలలోనే. కరోనా దెబ్బకు దిగాలుపడిన దేశ ఆర్థిక వ్యవస్థలో నూతనోత్సాహాన్ని నింపేందుకు నాటి గవర్నర్ దాస్ ప్రత్యేకంగా ఆర్బీఐ సమీక్ష నిర్వహించి రెపో రేటును తగ్గించారు. రుణ లభ్యత పెరిగేలా 4 శాతానికి దించారు. కానీ ద్రవ్యోల్బణం విజృంభించడంతో తదుపరి ద్రవ్యసమీక్షల్లో దాన్ని అదుపు చేసేందుకు మళ్లీ వడ్డీరేట్లను వరుసగా పెంచుతూపోయారు. ఈ క్రమంలో ఈసారి ద్రవ్యసమీక్షలో వడ్డీరేట్లు తగ్గితే ఐదేండ్ల తర్వాత ఇప్పుడే తగ్గినట్టు కానున్నది.

### ఆటో, రియల్టీకి ఉత్సాహం?

గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాలపై చాలాకాలం నుంచి అధిక వడ్డీరేట్లనే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు అనుసరిస్తున్నాయి. ఫలితంగా ఆయా రుణగ్రహీతలు, వివిధ వ్యాపార రంగాలు ప్రభావితమవుతున్నాయి. కానీ ఈసారి ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గిస్తే రియల్టీ, ఆటోతోపాటు పలు రంగాల్లో తిరిగి అమ్మకాలు పుంజుకుంటాయంటున్నారు. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. సుంకాలను పెంచుతూ వాణిజ్య యుద్ధానికి తెరతీస్తున్న నేపథ్యంలో వడ్డీరేట్ల తగ్గింపు తొందరపాటే అవుతుందంటున్నవారూ లేకపోలేదు. ముఖ్యంగా వడ్డీరేట్లు తగ్గితే రూపాయిపై మరింత ఒత్తిడి పెరుగుతుందని వారు విశ్లేషిస్తున్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ జీవనకాల కనిష్ఠాల్లో కదలాడుతున్న సంగతి విదితమే. కానీ దేశంలో వినిమయ శక్తిని పెంపొందించడానికి బడ్జెట్‌లో తన వంతుగా కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత ఆదాయ పన్ను ఊరటను కల్పించింది. ఈ క్రమంలో ఆర్బీఐ వంతుగా వడ్డీరేట్లను తగ్గించవచ్చన్న అంచనాలే ఎక్కువగా ఉన్నాయి.

## జొమాటో ఇకపై ఎటర్నల్

### పేరు మార్పునకు లైన్‌క్లియర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఆన్‌లైన్ ఫుడ్, గ్రాసరీ డెలివరీ దిగ్గజం జొమాటో.. పేరు మార్చుకుంటున్నది. ఎటర్నల్‌గా మారిపోతున్నది. ఇందుకు గురువారం జొమాటో సంస్థ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే కంపెనీ వాటాదారులు, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సంబంధిత అధికార వర్గాలు ఆమోదించాల్సి ఉన్నది. ఈ మేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో జొమాటో పేర్కొన్నది. కాగా, ఫుడ్ డెలివరీ బిజినెస్ బ్రాండ్ జొమాటో యాప్ పేరు మాత్రం అదే. 'పేరు మార్పునకు మా బోర్డు అంగీకరించింది. షేర్‌హోల్డర్స్ కూడా మద్దతివ్వాలని కోరుతున్నాను. కావాల్సిన అనుమతులన్నీ వచ్చాక మా కార్పొరేట్ వెబ్‌సైట్ పేరు జొమాటో.కామ్ నుంచి ఎటర్నల్.కామ్‌గా మారిపోతుంది. మా స్టాక్ టిక్కర్‌నూ మారుస్తాం' అని జొమాటో వ్యవస్థాపక సీఈవో దీపిందర్ తెలిపారు. ఎటర్నల్‌లో జొమాటో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్, హైపర్‌ప్యూర్ అనే 4 వ్యాపార విభాగాలుండనున్నాయి.

## టీసీఎస్ ఉద్యోగులకు షాక్

### సీనియర్ ఉద్యోగుల వేరియబుల్ చెల్లింపుల్లో కోత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ సీనియర్ ఉద్యోగులకు షాకిచ్చింది. డిసెంబర్ త్రైమాసికంలో సీనియర్ ఉద్యోగుల వేరియబుల్ చెల్లింపుల్లో 20 శాతం నుంచి 40 శాతం వరకు కోత విధించింది. ఉద్యోగి పనితీరు ఆధారంగా ఈ వేరియబుల్ చెల్లింపులు జరుపుతుంటుంది సంస్థ. వరుసగా రెండు త్రైమాసికాలుగా సిబ్బంది మెరుగైన పనితీరు కనబరిచినప్పటికీ వేరియబుల్ చెల్లింపుల్లో కోత విధించడం విశేషం. మొత్తం ఉద్యోగుల్లో 70 శాతం మందికి 100 శాతం వేరియబుల్ చెల్లింపులు జరిపినట్లు కంపెనీ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. కానీ, కొత పెట్టిన వారిలో సీనియర్ ఉద్యోగులు ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. ఉద్యోగులకు కార్యాలయాలకు రప్పించడంలో భాగంగా టీసీఎస్ వేరియబుల్ పే నిబంధనల్లో గతేడాది మార్పులు చేసిన విషయం తెలిసిందే. వేరియబుల్ పేను ఆఫీస్ హాజరు తో ముడిపెట్టింది. ఎవరైతే 60 శాతం కంటే తక్కువ ఆఫీస్‌కు హాజరవుతారో వారికి ఎలాంటి చెల్లింపులు ఉండవని స్పష్టంచేసింది. 60-75 శాతం ఉన్నవారికి 50 శాతం, 75-85 శాతం ఉన్నవారికి 75 శాతం, 85 శాతం కంటే ఎక్కువ హాజరుంటేనే వేరియబుల్ అందుకునేందుకు అర్హులుగా పేర్కొంది.

## క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకే సదస్సులు

### మంచిర్యాల జిల్లా జడ్జి మారంరెడ్డి అర్పిత




మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి మారంరెడ్డి అర్పిత

మందమర్రి, ఫిబ్రవరి 6: సమాజంలో రోజురోజుకు తీవ్ర రూపం దాల్చుతున్న క్యాన్సర్ వ్యాధి పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అవగాహన కల్పించేందుకే అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా న్యాయమూర్తి మారంరెడ్డి అర్పిత అన్నారు. మందమర్రి పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలో గల తవక్కల్ పాఠశాలలో గురువారం నిర్వహించిన క్యాన్సర్ అవగాహన సదస్సులకు న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తించినట్లయితే నివారణకు వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఏదైనా ఇబ్బంది కలిగినప్పుడు అనుమానం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఏటా లక్షలాది మందిని కాపాడగలిగే క్యాన్సర్ వ్యాధి ముందస్తు గుర్తింపు, చికిత్సలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. చట్టాల పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. మూడు లక్షలలోపు సంవత్సరాదాయం కలిగి ఉన్న పేద ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా న్యాయ సహాయం అందిస్తున్నదని ఆమె తెలిపారు. పేదలకు సమస్య వచ్చినప్పుడు ఒక న్యాయవాదిని ఏర్పాటు చేస్తుందని ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ నాగమణి, చీఫ్ డిఫెన్స్ లీగల్ ఏఐడీ కౌన్సిల్ న్యాయవారి ఎండీ సంధాని, తవక్కల్ విద్యా సంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బీమా చెక్కు అందజేత

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 6 : మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రమాద బీమా పాలసీపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పోస్టల్ శాఖలో ప్రమాద బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మంచిర్యాల పోస్టాఫీస్ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ టీ. వెంకటస్వామి, కాగజ్‌నగర్ పోస్టాఫీస్ ఇన్‌స్పెక్టర్ సతీశ్ మాట్లాడుతూ బెజ్జూర్ మండలానికి చెందిన పోర్సెట్టి జ్యోతిరామ్ పోస్టాఫీసులో రూ.520 ప్రమాద బీమా పాలసీ చేసుకున్నాడని వారికి మంజూరైన ప్రమాద బీమా లక్ష రూపాయల చెక్కును అందజేసినట్లు తెలిపారు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ద్వారా జుమిడి తుకారం, అల్లూరి లక్ష్మిలకు చెందిన రూ.2 లక్షల చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పోస్టాఫీస్ మేనేజర్ ఎం సాగర్, బీపీఎం సాయి కుమార్, మాజీ ఎంపీపీ దుబ్బుల నానయ్య, నాయకులు దుబ్బుల వెంకయ్య , అశోక్, గణేశ్, అంజన్న, వెంకన్న, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

నస్పూర్, ఫిబ్రవరి 6 : విద్యార్థులు పరీక్షల్లో భయాన్ని వీడి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని లైఫ్ కోచ్ ఆర్‌ఎల్ రామ్ అన్నారు. గురువారం మంచిర్యాలోని రాజీవ్‌నగర్ మోడల్ స్కూల్‌లో యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు.యువత సోషల్ మీడియాకు బానిసగా మారుతున్నారని ఇది సరి కాదని, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, ప్రిన్సిపాల్ బుచ్చన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

- సుపారీ ఇచ్చి మరీ యువతి హత్య
- వీడిన మిస్టరీ

చొప్పదండి, ఫిబ్రవరి 6 : వివాహేతర సంబంధం ఆ వివాహిత ప్రాణం తీసింది. పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్న ఆమె భర్తతో మనస్పర్ధలు వచ్చి వేరుగా జీవిస్తుండగా, ఈ క్రమంలో పరిచయమైన మరో యువకుడితో నమ్మి వెళ్లి హత్యకు గురైంది. గంగాధర మండలం కొండన్నపల్లి వద్ద అనుమానాస్పదంగా పడి ఉన్న మమత మృతదేహానికి సంబంధించిన కేసును పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి 10 రోజుల్లోనే ఛేదించారు. హత్య కేసు వివరాలను గురువారం చొప్పదండి పోలీస్ స్టేషన్‌లో సీఐ ప్రకాశ్‌గౌడ్ మీడియాకు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా ఖాసింపేటకు చెందిన మేడ మమత(25) భరత్‌కుమార్ అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. భర్తతో మనస్పర్ధల కారణంగా మంచిర్యాలలో తనకు తెలిసిన వారి ఇంట్లో ఉంటూ క్యాటరింగ్ పని చేస్తున్నది. ఇదే క్రమంలో మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ చెందిన సింగరేణి ఉద్యోగి కురుమల్ల భాస్కర్ అనే వ్యక్తితో మమతకు పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా వివాహేతర సంబంధంగా మారింది. మమతతో సంబంధం పెట్టుకున్న భాస్కర్, కుటుంబాన్ని పట్టించుకోకపోవడాన్ని అతడి అక్క కురుమల్ల నర్మద గుర్తించింది. ఆమెను దూరం చేస్తేనే భాస్కర్‌లో మార్పు వస్తుందని భావించింది. తండ్రి కురుమల్ల రాయలింగు, బావ బండ వెంకటేశ్, గుంపుల రఘు అనే వ్యక్తితో కలిసి మమత హత్యకు పథకం వేసింది. ఇందులో భాగంగా వేల్పుల కళ్యాణ్ అనే వ్యక్తికి రూ.5 లక్షలు సుపారీ ఇచ్చి డీల్ కుదుర్చుకుని, రూ.60 వేలు అడ్వాన్స్ ఇచ్చారు. పథకం ప్రకారం మమత ఫోన్ నంబర్‌ను తీసుకున్న కళ్యాణ్, వారం రోజుల పాటు ఆమెను అనుసరించి పరిచయం పెంచుకున్నాడు. అవసరాలకు డబ్బులు ఇచ్చి మచ్చిక చేసుకున్నాడు. ఇదే క్రమంలో గత నెల 25న సాయంత్రం 4:30 గంటలకు కిరాయికి తీసుకున్న కారులో మమతను, ఆమె నాలుగేళ్ల కొడుకును ఎక్కించుకొని చీకటి పడేవరకు మంచిర్యాలలోనే తిప్పాడు. సాయంత్రం 6 గంటల సమయంలో తన వెంట తెచ్చుకున్న కత్తితో మెడపై పొడిచి, నైలాన్ తాడుతో మెడకు ఉరేసి కారులోనే హత్య చేశాడు. నర్మద వాళ్లను పిలిచి శవాన్ని చూపించి వారి నుంచి రూ.4 లక్షలు తీసుకున్నాడు. అదే రోజు రాత్రి కారులో మమత శవంతో బయలుదేరి మంచిర్యాల, లక్షెట్టిపేట, ధర్మపురి, జగిత్యాల మీదుగా వచ్చి రాత్రి 11 గంటల సమయంలో గంగాధర మండలం కురిక్యాల శివారులోని వరదకాలువ వద్దకు చేరుకున్నాడు. అక్కడ శవాన్ని పడవేసి నాలుగేళ్ల బాబుతో హైదరాబాద్‌కు పారిపోయాడు. గత నెల 29న గుర్తు తెలియని మహిళ శవంగా మీడియాలో వచ్చిన కథనాలు చూసిన కుటుంబ సభ్యులు మమతగా గుర్తుపట్టి గంగాధర పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. వివరాలు తెలుసుకున్న పోలీసులు మంచిర్యాలకు వెళ్లి సీసీ పుటేజీల ద్వారా మమత కారులో వెళ్లినట్లు తెలుసుకున్నారు. ఆధునిక టెక్నాలజీతో కారు నంబర్‌ను గుర్తించారు. సెల్ఫ్ డ్రైవింగ్‌తో కళ్యాణ్ పారిపోయి చెన్నైలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడికి వెళ్లి పట్టుకోవడానికి ప్రయత్నించగా బాబును వదిలిపెట్టి పారిపోయాడు. బాబును కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసు పరిశోధనను మరింత ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా బుధవారం గంగాధర మండలం వెంకటాయపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో నిందితుడు కళ్యాణ్ పట్టుబడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. కళ్యాణ్‌తో పాటు గుంపుల రఘు, కురుమల్ల నర్మద, బండ వెంకటేశ్, కురుమల్ల రాజలింగుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన గంగాధర ఎస్ఐ నరేందర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ జంపయ్య, రామడుగు కానిస్టేబుల్ శ్రీధర్, ఐటీ సెల్ కానిస్టేబుళ్లు ప్రదీప్, మహేందర్‌ను సీఐ అభినందించారు.

# ఆడపిల్లలకు అండగా భరోసా కేంద్రాలు



నస్పూర్‌లోని మంచిర్యాల జిల్లా భరోసా సెంటర్‌లో విద్యార్థినులతో కలిసి కేక్ కట్ చేస్తున్న డీసీపీ భాస్కర్

- మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్
- ఘనంగా కేంద్రం వార్షికోత్సవం

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 6 : ఆడ పిల్లలు, బాధిత మహిళలకు భరోసా కేంద్రాలు అండగా నిలుస్తున్నాయని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ పేర్కొన్నారు. నస్పూర్‌లో మంచిర్యాల జిల్లా భరోసా సెంటర్ ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్ మహిళలు, విద్యార్థినులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భరోసా సెంటర్లు ఏర్పాటు చేయడం వల్ల లైంగిక దాడి కేసుల్లో నిందితులకు శిక్షలు పడుతున్నట్లు చెప్పారు. మంచిర్యాల భరోసా కేంద్రానికి 17 కేసులు వచ్చాయని, ఇందులో 13 పోక్సో కేసులు, 4 రేప్ కేసులు ఉన్నాయన్నారు. 57 అవగాహన కార్యక్రమాలు చేపట్టి భరోసానింపినట్లు నిర్వాహకులు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లడానికి ఇబ్బంది పడే బాధిత మహిళలు, బాలికలు నేరుగా భరోసా కేంద్రానికి వచ్చి సాయం పొందవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నరేష్‌కుమార్, సీసీసీ నస్పూర్ ఎస్ఐ సుగుణాకర్, షీటీం ఎస్ఐ హైమా, మంచిర్యాల ఎస్ఐ వినీత, ఏఎస్ఐ ఏజాస్, భరోసా సెంటర్ కౌన్సిలర్, కోఆర్డినేటర్ విజయ, లీగల్ అడ్వైజర్ నవ్యక్రిష్ణ, ఏఎన్‌ఎం ప్రమీల, సిబ్బంది పుష్పలత, ప్రియాంక, రజిత పాల్గొన్నారు.

## కోలిండియా క్యారమ్స్ పోటీల్లో ప్రతిభ

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 6 : కోలిండియా స్థాయి క్యారమ్స్ పోటీల్లో సింగరేణి టీం క్రీడాకారులు చాంపియన్ షిప్ సాధించారు. శ్రీరాంపూర్ ఓసీపీలో అటెండెంట్‌గా పనిచేస్తున్న ఎస్‌కే తాజొద్దీన్, ఆర్కే 6గనికి చెందిన సైజన్‌రావు జనరల్‌మజ్దూర్ కార్మికులు సింగిల్స్, డబుల్స్ క్యారమ్స్ పోటీల్లో పాల్గొని విజయం సాధించారు. 3,4,5 రోజుల్లో జార్కాండ్ రాష్ట్రంలో జరిగిన కోలిండియా క్యారమ్స్ పోటీల్లో సింగిల్స్, డబుల్స్‌లో విజయం సాధించిన చాంపియన్ షిప్ సాధించారు. వీరినని జీఎం సూర్యనాయణ, డీవైజీఎం అరవిందరావు, పీవో శ్రీనివాస్, ఆర్కే 6 మేనేజర్ తిరుపతి అభినందించారు.




ట్రోఫీతో క్రీడాకారులు

## అట్రాసిటీ కేసు నమోదు

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 6: ఓ వ్యక్తిని కులం పేరుతో దూషించడమే కాకుండా దాడికి ప్రయత్నించిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రమోద్ రావు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి పట్టణంలోని కాంట్రాక్టర్ బస్తీకి చెందిన ఆవుల సాయిబాబా జిల్లా కేంద్రంలోని గర్మిళ్ల శివారులోని తాడిపత్రి రవీందర్ రెడ్డి, గోదారి రవి కలిసి వేసిన వెంచర్లో రూ.31.50 లక్షలతో రెండు ప్లాట్లు కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి సాయిబాబా పేరిట రవీందర్ రెడ్డి భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా, కాలయాపన చేస్తూ వచ్చాడు. గతనెల 30 ప్లాట్ రిజిస్ట్రేషన్ విషయమై రవీందర్ రెడ్డి ఇంటికి వెళ్లి అడిగిన బాధితుడిని కులం పేరుతో దూషించడమే గాకుండా, దాడికి ప్రయత్నించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రవీందర్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


## ఐటీడీఏ కాలనీలో చోరీ

భీమారం, ఫిబ్రవరి 6: భీమారం ఐటీడీఏ కాలనీలోని రాంటెంకి రంజిత్ ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. రూ.50 వేల నగదు, రూ.42 వేల విలువగల ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు ఎస్ఐ శ్వేత తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారాం.. రంజిత్ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి పిల్లలకు అక్షరాభ్యాసం చేయించేందుకు సిద్దిపేట జిల్లా శనిగరంలోని సరస్వతీ ఆలయానికి వెళ్లగా గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## టీఎంపీడీవోల జిల్లా కార్యవర్గం ఎన్నిక

చెన్నూర్ టౌన్, ఫిబ్రవరి 6 : తెలంగాణ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల (టీఎంపీడీవోల) జిల్లా కార్యవర్గాన్ని గురువార సాయంత్రం ఎన్నుకున్నారు. జిల్లా ప్రజాపరిషత్ మంచిర్యాల జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి వీ.గణపతి అధ్యక్షతన జడ్పీ సమావేశ మందిరంలో ఎన్నికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నియమాలను జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి వివరించారు. అనంతరం జిలా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ప్రెసిడెంట్‌గా ఎం.మోహన్ (చెన్నూర్ ఎంపీడీవో), ప్రధాన కార్యదర్శిగా పీ.శ్రీనివాస్ (తాండూర్ ఎంపీడీవో), ఉపాధ్యక్షులుగా బీ.గంగామోహన్ (భీమిని ఎంపీడీవో), కోశాధికారిగా ఎం.దేవేందర్ రెడ్డి (నెన్నెల ఎంపీడీవో), ఈసీ మెంబర్లుగా ఎన్.రాజేశ్వర్ (మందమర్రి ఎంపీడీవో), జేఆర్ ప్రసాద్(దండేపల్లి ఎంపీడీవో)లు ఎన్నికయ్యారు. ఒక్కో పోస్టుకు ఒక నామినేషన్ మాత్రమే రావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జడ్పీ సీఈవో వీ.గణపతి పేర్కొన్నారు.

## పాఠశాలలో స్టైల్ లెస్ హెయిర్ కటింగ్



స్టైల్ లెస్ హెయిర్ కటింగ్ అనంతరం విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు అశోక్

పెంచికల్ పేట్, ఫిబ్రవరి 6 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అశోక్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గురువారం తన సొంత డబ్బులతో విద్యార్థులకు స్టైల్ లెస్ హెయిర్ కటింగ్ చేయించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణకు విరుద్ధంగా హెయిర్ కటింగ్ చేయించుకుంటున్నారని, పలు మార్లు చెప్పినా తల్లిదండ్రులు, విద్యార్థులు మారకపోవడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో ఇలాంటి కార్యక్రమం చేపట్టడం మొదటిసారి కావడంతో ప్రధానోపాధ్యాయుడు అశోక్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో బార్బర్ ప్రమోద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.